క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దౌల్తాబాద్: చల్లాపూర్ ఫీడర్ పరిధిలో ట్రీ కటింగ్, సురాయిపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా చల్లాపూర్, ఈర్లపల్లి గ్రామాల్లో సోమవారం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీజేపీలో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే రత్నం

నవాబుపేట: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు మాజీ సర్పంచులు.. మాజీ ఎమ్మెల్యే కే.ఎస్.రత్నం ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కేఎస్.. పార్టీలో చేరిన వారికి కాషాయ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇందులో రత్నం, పద్మ రామచంద్రయ్య, నరసింహారెడ్డి, సుభాన్ రెడ్డి, అంజయ్య, సుధాకర్ రెడ్డిలు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మల్లేశం పాల్గొన్నారు.

నేడు బీజేపీ ఓబీసీ సమ్మేళనం

పరిగి: పట్టణ కేంద్రంలో సోమవారం ఓబీసీ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గార్డెన్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు జరగనుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, పలువురు ముఖ్య నాయకులు హాజరవుతారని, కావున జిల్లా, నియోజకవర్గ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

దోమ: మండల పరిధి దిర్సంపల్లి శివాంజనేయ నూతన ఆలయానికి కమిటీని ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కమిటీ చైర్మన్‌గా లక్ష్మీనారాయణగౌడ్, వైస్ చైర్మన్‌గా మోహన్, ప్రధాన కార్యదర్శిగా కుర్వమల్లేశ్, కార్యదర్శిగా జగదీశ్వర్‌రెడ్డి, కార్యనిర్వాహకుడిగా సతీష్‌కుమార్, సభ్యులుగా తిరుపతి, సత్తయ్య, రాములుగౌడ్, మహిపాల్‌రెడ్డి, రాజు, హన్మంతులను నియమించారు. అనంతరం సభ్యులు మాట్లాడారు. ఏటా ఉత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

నియామకం


రాజు నాయక్

కుల్కచర్ల: గిరిజన మోర్చా మండల ఉపాధ్యక్షుడిగా ఘణపూర్ గ్రామానికి చెందిన రాజు నాయక్‌ను నియమించినట్లు జిల్లా కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన బీజేపీ జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బొంరాస్‌పేట: గీతాజ్ఞాన గురుభక్త మండలి ఆధ్వర్యంలో మండల పరిధి దుప్‌చర్లలో సోమవారం ఉచిత కంటి వైద్య, సాధారణ వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు ఎం.వెంకటేశం తెలిపారు. జగద్గురు రాములు జ్ఞాపకార్థంగా సద్గురు రామబ్రహ్మానంద స్వామిచే.. మండలి సభ్యులు శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక పాఠశాల ఆవరణలో ఉదయం నుంచి.. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ఎంఎస్ రెడ్డి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేయనున్నారని, అనారోగ్య సమస్యలు ఉన్న వారు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. అదే విధంగా ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ధాన్యం, 9 గంటల వరకు సద్గురు పూజ గురుచాలీసా, గీతాపారాయణం సాయంత్రం 3గంటల వరకు సాధారణ వైద్య పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు.

ఆర్థిక సాయం అందజేత

పూడూరు: మండల పరిధి తిర్మలాపూర్ పంచాయతీకి చెందిన రాత్లావత్ శాంతిబాయి, ప్రకాష్‌ల కూతురు వివాహానికి ఆదివారం డీసీసీ కార్యదర్శి పెంటయ్య రూ.11 వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. గ్రామంలో ఎలాంటి శుభకార్యం జరిగినా.. తన వంతు సహకారం ఉంటుందని ఈ సందర్భంగా పెంటయ్య తెలిపారు. ఇందులో నాయకులు రాములునాయక్, గోపాల్‌నాయక్, రహీం, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

యాచారం: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శంకర్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం సాగర్‌రోడ్డుపై పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. నిబంధనల ప్రకారం డబ్బులు వెంట తీసుకెళ్లాలని సూచించారు. అక్రమంగా డబ్బు తరలించవద్దని, మద్యం, సరఫరా చేయరాదని చెప్పారు. ఇంట్లో కూడా అధిక నిల్వలు ఉంచరాదన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు.

కొనేవారు రాక.. మద్దతు లేక..

బహిరంగ మార్కెట్లో మద్దతు ధర నిల్
- నెమ్మదించిన కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- ఆందోళనలో అన్నదాతలు
- ధాన్యం కాపాడుకోలేక ఇక్కట్లు


మద్దతు లేక మార్కెట్లో నిల్వచేసిన ధాన్యం బస్తాలు

ధారూరు: పంటలు చేతికి వచ్చినా.. కొనేవారు లేక కర్షకులు ఇబ్బంది పడుతున్నారు. మార్కెట్‌కు తీసుకువచ్చిన ధాన్యాన్ని అక్కడే ఎండబెడుతున్నప్పటికీ.. అకాల వర్షాల సూచనలు రైతులను కలవరపెడుతున్నాయి. ఇప్పటి వరకు మండల పరిధిలో రెండు కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. తొలుత మండల కేంద్రంలో ప్రారంభించాల్సి ఉండగా.. ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోలేదని అన్నదాతలు పేర్కొన్నారు. పీఏసీఎస్ నుంచి ఒకటి, వ్యవసాయమార్కెట్ (ఏఎంసీ) కమిటీ ద్వారా మరో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించాల్సి ఉంది. కానీ.. ఈ సారి తాము కొనుగోలు కేంద్రం బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు మార్కెట్ కమిటీ ఉన్నతాధికారులకు విన్నవించింది. ఏఎంసీ తప్పుకుంటే సొసైటీ ద్వారా ధాన్యం సేకరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గన్నీబ్యాగ్స్ లేక..

ప్రస్తుతం ధారూరులో రెండు, నాగారం, రాంపూర్‌తండా, గురుదోట్ల, తరిగోపుల, మోమిన్‌కలాన్ తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంది. రెండు రోజుల క్రితం గట్టెపల్లి, నాగసమందర్‌లో కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ.. గన్నీబ్యాగుల సరఫరా లేక అక్కడ కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో వచ్చిన దిగుబడిని పొలాల్లో ఉంచలేక, ఇంట్లో నిల్వ చేసుకోలేక.. బహిరంగ మార్కెట్లో వ్యాపారులు చెప్పిన ధరకు విక్రయించి నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని, కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, సంచుల కొరత లేకుండా చూడాలని కోరుతున్నారు.

మార్కెట్లో మద్దతు ధర కరువే

స్థానిక వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలుకు వ్యాపారులు రాకపోవడం, మద్దతు ధర లేక, మార్కెట్‌కు తెచ్చిన పంటను విక్రయించకుండా రైతులు నిరీక్షిస్తున్నారు. శనివారం మార్కెట్‌కు రైతులు ధాన్యం బస్తాలు తీసుకువచ్చినా.. ప్రభుత్వ ధర కన్నా.. రూ.200లు తక్కువగా పలకడంతో అమ్మేందుకు మక్కువ చూపలేదు. రెండు వారాలుగా ఒకరిద్దరు కొనుగోలుదారులు రావడం, రూ.2వేల కన్నా తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు యత్నించగా.. రైతులు వ్యతిరేకించడం నిత్యం జరుగుతూనే ఉంది. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,203 ఉండగా.. వ్యాపారులు రూ.1,975లకే దిగుబడిని దక్కించుకొని, రైతులను దగా చేస్తున్నారని పలువురు ఆరోపించారు.


చినుకులు పడుతుండటంతో రాశులపై పాలిథిన్ కవర్లు కప్పుతున్న రైతు

రైతుకు అందని రాయితీ

- సబ్సిడీపై తగ్గుతున్న వ్యవసాయ పరికరాలు
- పెట్టుబడి భరించలేక పోతున్న రైతులు
- కొత్త ప్రభుత్వంపై ఆశలు



దౌల్తాబాద్: రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాటల్లో చెబుతున్నా.. చేతల్లో చూపడం లేదు. ఆధునిక కాలానికి అనుగుణంగా వ్యవసాయ సాంకేతికత, యాంత్రీకరణ పథకాలు రైతుల దరిచేరడంలేదు. గత ప్రభుత్వం వ్యవసాయ పనిముట్ల రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా ఆటకెక్కిస్తూ రైతన్న ఆశలపై నీళ్లు చల్లినప్పటికీ.. కొత్త ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకున్నారు.

అందని ద్రాక్షగా..

మండల పరిధి 33 గ్రామాల్లో 18వేల మంది రైతులు ఉన్నారు. గతంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రోటోవేటర్, కల్టివేటర్, తైవాన్ స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్లు, నాగళ్లు వంటి అనేక రకాల సాగు పనిముట్లు సబ్సిడీపై రైతులకు అందేవి. కానీ.. ప్రస్తుతం రాయితీ రైతులకు అందని ద్రాక్షగా మారింది. సబ్సిడీ పథకాలు 2006–07 ఆర్థిక సంవత్సరం నుంచి ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి. 2016–17 వరకు అందుబాటులో ఉన్న 10నుంచి 12 రకాల పనిముట్లు ఆ తర్వాత సగానికి తగ్గిపోయాయి. తాజాగా ఆ సంఖ్య నామమాత్రమయింది. దీంతో పంటలకు అధిక పెట్టుబడి అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంజూరు నామమాత్రమే..

ఓ వైపు యాంత్రీకరణ పథకాలు ఒక్కొక్కటిగా నిలిచిపోతుండగా, మరో పక్క మంజూరయ్యే యూనిట్లు నామమాత్రంగానే ఉంటున్నాయి. తైవాన్ స్ప్రేయర్లకు మంగళం పాడిన వ్యవసాయశాఖ.. వాటి స్థానంలో రీచార్జ్ స్ప్రేయర్లు మంజూరు చేసింది. ప్రస్తుతం రైతులకు నిత్యవసరంగా మారిన టార్పాలిన్లు సరిపడా మంజూరు కావడంలేదు. కల్టివేటర్లు, రోటోవేటర్ల జాడ లేనేలేదు.

సబ్సిడీతో మేలు

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు లభించడం లేదు. దీంతో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నాం. ధర అధికంగా వెచ్చించినా.. నాణ్యత లేక మోసపోతున్నాం. ప్రస్తుత ప్రభుత్వం గతంలో మాదిరి రాయితీపై పనిముట్లు అందజేస్తే.. రైతులకు మేలు.

–గోవిందురెడ్డి, రైతు, దౌల్తాబాద్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



సబ్సిడీపై పనిముట్లు, యంత్రాల కోసం రైతులు కార్యాలయానికి వస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. గతంలో ఉన్న పథకాలు రాకపోయినప్పటికీ.. రైతులకు ఉపయోగపడే యూనిట్లు మాత్రం మళ్లీ అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఈ విషయాన్ని రైతులు గమనించాలి.

–లావణ్య, ఇన్‌చార్జి ఏఓ, దౌల్తాబాద్

బైక్ ర్యాలీని జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి

మర్పల్లి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో సోమవారం ఉదయం 8 గంటలకు నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఎంపీ రంజిత్‌రెడ్డి గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని బూచన్‌పల్లి చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు చేపట్టే ర్యాలీలో ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, తదితర నాయకులు పాల్గొననున్నారని, కావున పార్టీ శ్రేణులు బైక్‌లతో తరలి రావాలని కోరారు. సమీక్షలో మండల ఎన్నికల ఇన్‌చార్జిలు రాములు యాదవ్, సుభాష్ యాదవ్, ఖలీమొద్దీన్, శంకరయ్య గౌడ్, రవీందర్, రామేశ్వర్, దివాకర్, పర్వేద శ్రీనివాస్, సురేష్, నర్సింలు యాదవ్, పాండురంగారెడ్డి, సంజీవరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు సురేష్, రఫీ, రాచన్న, సహకార సంఘం ఉపాధ్యక్షుడు ఫసి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు ఆనందం, మాజీ సర్పంచ్‌లు రాములు, అబ్రహం, పాండునాయక్, రాచన్న, నర్సింహారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధి మద్దూరు ఊరడమ్మ, మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో వారు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని సూచించారు. వేద పండితులు ఆధ్వర్యంలో వారు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రవినాయక్, టీపీసీసీ కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, పొన్న జయమ్మ వెంకట్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రాంరెడ్డి, సుధాకర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, గ్రామస్తులు, తదితరులున్నారు.


భీంభరత్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, తదితరులు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దు
- చేవెళ్లలో రంజిత్, పాలమూరులో వంశీని ఆశీర్వదించండి
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు


బంట్వారం: సల్బత్తాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం


ధారూరు: ప్రచారం చేస్తున్న నాయకులు

బంట్వారం: లోకసభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆదివారం పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఇందులో రంజిత్ సోదరుడు వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. రంజిత్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇచ్చి, పార్లమెంటుకు పంపాలని ఓటర్లను అభ్యర్థించారు. బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోరాదని, ప్రజలకు అందుబాటులో ఉండే రంజిత్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, సుదర్శన్, రాములు, నర్సింలు, వెంకటయ్య, గిరిదాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

ధారూరు: ఎంపీగా రంజిత్‌రెడ్డిని మరోసారి గెలిపిస్తే కొత్తగా మరిన్ని సంక్షేమ పథకాలు మంజూరు అవుతాయని కాంగ్రెస్ నేతలు అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆ పార్టీ శ్రేణులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఓటర్లకు వివరించారు. లోక్‌సభ ఎన్నికల హామీలను పేర్కొంటూ.. కేంద్రంలో కాంగ్రెస్ సర్కారు కొలువు దీరితో తెలంగాణతో పాటు, దేశం మరింత అభివృద్ధిలో పరుగులు తీస్తుందని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని వెల్లడించారు. అందుకు పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహ్మద్ బాబాకాన్, కల్వ కిరణ్‌కుమార్, ఎల్.అశోక్ ముదిరాజ్, అమరేశ్వర్‌రావు, ముజాఫర్, అంజయ్య, రాఘవేందర్‌గౌడ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వంశీకి మద్దతుగా..

దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీ పాలమూరు ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ శ్రేణులు మండల పరిధి గుముడాల, దౌల్తాబాద్, బాలంపేట, సురాయిపల్లి, మాటూరు, చల్లాపూర్ గ్రామాల్లో జోరుగా ప్రచారం చేశారు. వంశీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని, కొడంగల్‌కు చెందిన రేవంత్‌రెడ్డి సీఎంగా ఉండడంతో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. కావున రేవంత్‌కు మద్దతుగా వంశీని ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు, వీరన్న, వెంకట్‌రెడ్డి, దస్తప్ప తదితరులు ఉన్నారు.

స్వచ్ఛందంగా పార్టీలో చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే

కుల్కచర్ల: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనకు ఆకర్షితులైన ఇతర పార్టీల శ్రేణులు స్వచ్ఛందగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. మండల పరిధి పీరంపల్లికి చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు సుమారు 50మంది యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగయ్య ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే సమక్షంలో హస్తం కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, విఠల్ నాయక్, సాల్వీడు విఠల్, పీరంపల్లి తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే మోదీ ధ్యేయం


కుల్కచర్ల: అల్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ శ్రేణులు

- కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి
- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఆశీర్వదించండి
- ఇంటింటి ప్రచారంలో కమలనాథులు

కుల్కచర్ల: దేశ భద్రతకు పాటుపడే పార్టీ బీజేపీ మాత్రమేనని, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి అండగా నిలిచి, మరోసారి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గాదె మైపాల్ కోరారు. ఆదివారం మండల పరిధి అల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో బీజేపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కమలనాథులు మాట్లాడారు. పదేళ్ల కాలంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల్లో కేంద్ర ప్రభుత్వ నిధులే అధికంగా ఉన్నాయని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. దేశంలో మరింత అభివృద్ధి, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలంటే మరోసారి మోదీని ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి హన్మంతు, ఎస్సీమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు అంకితం..

ధారూరు: ప్రజాసేవకు అంకితం అయిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ శ్రేణులు కోరారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి పీసీఎంతండా, అంపల్లి, గురుదోట్ల, మోమిన్ ఖుర్దు, రాజాపూర్ గ్రామాల్లో ఆ పార్టీ నేతలు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా దశాబ్ద కాలంలో ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి, అమలు చేసి సంక్షేమ పథకాల గురించి ఓటర్లకు వివరించారు. బీజేపీని బలపర్చి కొండాను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడి, జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు ఎం.రమేశ్, నాయకులు విజయలక్ష్మి, అనిల్‌గౌడ్, సాయిగౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే..

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు విశ్వజిత్‌రెడ్డి తెలిపారు. వికారాబాద్ మండల పరిధి గ్రామాల్లో కొండాకు మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా విశ్వజిత్ మాట్లాడారు. దేశంలో మోదీ హవా కొనసాగుతుందన్నారు. దేశం అన్ని విధాలా సుభిక్షంగా ఉండాలంటే మరోసారి మోదీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. అందుకు కొండాను గెలిపించి, చేవెళ్లను ప్రధాని మోదీకి కానుకగా ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇందులో పార్టీ నాయకులు వడ్ల నందు, బుచ్చిరెడ్డి, శివరాజు తదితరులు ఉన్నారు.

కోట్‌మర్పల్లిలో..

మర్పల్లి: మండల పరిధి కోట్‌మర్పల్లిలో బీజేపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి ఓటర్లకు వివరించారు. అనంతరం మాట్లాడారు. దేశం మరింత అభివృద్ధి చెందాలన్నా.. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నా.. మోదీని మరోసారి ఆశీర్వదించాలన్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి, చేవెళ్లను మోదీకి కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఇందులో పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బలరాంగౌడ్, సంతోశ్‌రెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.


దారూరు: మోమిన్‌ఖుర్దులో ప్రచారం చేస్తున్న నాయకులు


అనంతగిరి: మహిళలతో మాట్లాడుతున్న విశ్వజిత్


మర్పల్లిలో..

'కొండా' గెలుపు ఖాయం


పార్టీలో చేరిన వారితో శివరాజు తదితరులు

అనంతగిరి: చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు ధీమా వ్యక్తంచేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు వికారాబాద్‌లో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి అధ్యక్షతన ఇంటింటి ప్రచారం చేశారు. దశాబ్ద కాలంలో కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, పార్టీ మేనిఫెస్టోను ఓటర్లకు వివరించారు. అనంతరం మాట్లాడారు. బీజేపీ అన్ని రంగాల్లో, అన్ని ప్రాంతాల్లో సమానాభివృద్ధి చేసిందని, అందుకే ఈ సారి అత్యధిక స్థానంలో గెలుపొందుతుందని ధీమా వ్యక్తంచేశారు. ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని, మరోసారి మోదీని ప్రధానిగా ఆశీర్వదించేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. కొండాను గెలిపించి, చేవెళ్లను మోదీకి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు శివరాజు ఆధ్వర్యంలో పార్టీలో చేరగా.. వారికి కాషాయ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇందులో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు యాస్కి శిరీష, మాజీ కౌన్సిలర్ సుచరితారెడ్డి, సీనియర్ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా మల్లన్న, బీరప్ప ఉత్సవాలు

చేవెళ్ల: మండల పరిధి దామరగిద్ద గ్రామంలో మల్లన్న, బీరప్ప ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం గ్రామస్తులు స్వామి వార్లకు బోనాలు చేసి, నైవేద్యం సమర్పించారు. ఈ ఉత్సవాల్లో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో బోనాల ఊరేగింపు వైభవంగా సాగింది. పూజా కార్యక్రమాల్లో చేవెళ్ల ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, బీజేపీ నాయకులు అనంత్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కుంచం శ్రీనివాస్, అశోక్, మధుసూదన్‌రెడ్డి, గ్రామ నాయకులు యూత్‌సభ్యులు నిర్వాహకులు పాల్గొన్నారు.

మండే ఎండలతో జాగ్రత్త


చలివేంద్రం ప్రారంభిస్తున్న శేఖర్‌రెడ్డి

కొత్తూరు: మండే ఎండలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శేఖర్‌రెడ్డి సూచించారు. వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు సొంత నిధులతో రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేసి, ఆదివారం ప్రారంభించారు. అనంతరం శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. పెరుగుతున్న ఎండల కారణంగా ప్రజలు అత్యవసరం ఉంటేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని సూచించారు. ఎండలో ప్రయాణించేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వడదెబ్బకు గురైతే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా చికిత్స చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా ఎండలో బయటకు వచ్చే వారు తప్పనిసరిగా నీరు, పండ్ల రసాలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, రవీందర్‌రెడ్డి, పాషా, తిరుపతిరెడ్డి, జాఫర్, కుమార్, ఖాజా, హైమాద్‌ఖాన్, మల్లేశ్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.